క్లుప్తంగా

మంత్రి అడ్లూరిని కలిసిన వినయ్‌రెడ్డి



ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ఎ స్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను హైదరాబాద్‌లో ఆదివారం ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ నియోజక వర్గం అభివృద్ధికి నిధులు కేటాయించాలని అడ్లూరిని వినయ్‌రెడ్డి కోరారు.

నిధులు మంజూరు చేయండి



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో జితేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశాడు. నిధుల మంజూరుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు జితేందర్ రెడ్డి తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మాక్లూర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలుపడంతో కాంగ్రెస్ నాయకు లు హర్షం వ్యక్తం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవిప్రకాష్, విండో చైర్మన్ బూరోల్ల ఆశోక్‌ల ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి మహేష్‌కుమార్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సీనియర్ నాయకులు గంగాధర్‌గౌడ్, జి పురుషోత్తం, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ రావు, మాక్లూర్ విండో చైర్మన్ బూరోల్ల అశోక్, ఉ పాధ్యక్షుడు గుండారం శేఖర్, మాజీ చైర్మన్ బి ద యాకర్‌రావు, జాఫర్, ఎస్‌కె అరీఫ్, కిషన్, రాజేశ్వర్, భాస్కర్ అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



ఆర్మూర్‌టౌన్: సమాజ శ్రేయస్సు కోరే ఇటువంటి స్వచ్ఛంద కార్యక్రమాలు మరింతగా విస్తరించాలని సియోను సహవాసము చర్చి పాస్టర్ సీహెచ్ పాల్ అన్నారు. ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సియోను సహవాసము చర్చి ఆవరణలోని చెత్త చెదారం, పిచ్చి మొక్కలను తొలగించామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి సభ్యులు జి.కృపానందం, స దానంద్, ప్రభుదాస్, జార్జ్, సాయన్న, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రశాంత్, సుంకె నిశాంత్, గణేష్, నూకల ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎస్సారెస్పీ కార్యాలయం

- మరమ్మతులకు నోచుకోని భవనం
- వర్షం కురిస్తే ఊరుస్తున్నా పట్టించుకోని అధికారులు



ప్రాజెక్ట్ కార్యాలయంపై పెరిగిన రావి చెట్లు



శిథిలావస్థకు చేరిన ప్రాజెక్ట్ కార్యాలయం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ అధికారుల కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఇందులో ఎస్ఈ, డిప్యూటీ ఎస్ఈ, ఈఈ, డిప్యూటీ ఈఈలతో పాటు కార్యాలయ విభాగం అధికారులు విధులు నిర్వహిస్తుంటారు. అధికారులు ఇదివరకే మొదటి అంతస్తును ఖాళీ చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణ శంకుస్థాపన కంటే ముందే ఎస్సారెస్పీ కార్యాలయ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఎస్సీ డివిజన్ల అధికారులకు నిలయంగా ఉన్న కార్యాలయం ప్రస్తుతం ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో ఉంది. ప్రస్తుతం పోచంపాడ్ డివిజన్ -1 కార్యాలయ అధికారులు ఇక్కడే విధులు పనిచేస్తున్నారు. వర్షం కురిసినప్పుడు కార్యాలయ భవనం ఊరుస్తోంది. గతంలో భవనం పెచ్చులూడి పడ్డాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోడలపై పెరిగిన రావి చెట్లు..

ప్రాజెక్ట్ కార్యాలయ గోడలపై రావి చెట్లు పెరుగుతున్నాయి. కనీసం వాటిని కూడ తొలగించే పరిస్థితిలో కార్యాలయ సిబ్బంది లేరు. దీంతో భవనం మరింత శిథిలావస్థకు చేరింది. తలుపులు తుప్పుపట్టిపోయాయి. పాలకులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులు, ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

ప్రాజెక్ట్ కార్యాలయ పరిస్థితిని ఉన్నత అధికారులకు నివేదించాం. వర్షం కురిస్తే మొదటి అంతస్తు ఊరుస్తుంది. దీంతో ఖాళీ చేసి కార్యాలయాలను కింది భవనంలోకి మార్చాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

శిథిలావస్థకు చేరిన స్కూలు భవనం కూల్చివేత



భవనాన్ని కూల్చివేస్తున్న గ్రామస్తులు

వేల్పూర్: వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామంలో శిథిలావస్థకు చేరిన ప్రైమరీస్కూలు భవనాన్ని గ్రామస్తులు ఆదివారం కూల్చివేశారు. చాలా ఏళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో కొన్నేళ్ల నుంచి అందులో తరగతులు నిర్వహించడం లేదు. కొత్తగా నిర్మించిన గదుల్లో తరగతులు కొనసాగిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డికి భవనం కూల్చేయాలని విన్నవించగా వెంటనే జెడ్పీ అధికారులతో మాట్లాడి అనుమతి ఇప్పించినట్లు హైస్కూలు, ప్రైమరీస్కూలు హెచ్ఎంలు హరిచరణ్, హరిప్రసాద్ తెలిపారు. కూల్చివేతకు అయిన ఖర్చు తానే భరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నిలిచిన సైన్స్ ల్యాబ్ భవనాల నిర్మాణం

- నూత్‌పల్లి, గాదేపల్లి పాఠశాలలకు మంజూరు
- ఇబ్బందిపడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



నూత్‌పల్లి జెడ్పీ స్కూల్‌లో నిర్మాణం మధ్యలో ఉన్న సైన్స్ ల్యాబ్ భవనం

డొంకేశ్వర్: మండలంలోని నూత్‌పల్లి, గాదేపల్లి జెడ్పీ పాఠశాలలకు రెండేళ్ల క్రితం సైన్స్ ల్యాబ్‌లు మంజూరు అయ్యాయి. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో పనులు మధ్యలో నిలిచిపోయాయి. ప్రభు త్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ల్యాబ్‌లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు మండలానికి రెండు భవనాలు మంజూరు చేయగా ఒక్కో దానికి రూ.13.5లక్షలు కేటాయించింది. నిర్మించే బాధ్యతలను సాంఘిక సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ చూస్తుండగా, 2023లో ఓ కాంట్రాక్టర్‌కు టెండరు అప్పగించారు. ప్రస్తుతం నూత్‌పల్లి, గాదేపల్లిలలో స్లాబు వరకు నిర్మాణ పనులు జరిగాయి. ల్యాబ్ లు అందుబాటులో లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పనులు పూర్తయ్యేలా చూస్తాం

మండలంలోని నూత్‌పల్లి, గాదేపల్లి పాఠశాలలకు ల్యాబ్‌లు మంజూరయ్యాయి. ప్రస్తుతం వీటి నిర్మాణాలు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరగా ల్యాబ్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం. – రామకృష్ణ, ఎంఈవో, డొంకేశ్వర్

ప్రకృతిని పరిరక్షించే బాధ్యత ప్రతిఒక్కరిది

ఆర్మూర్‌టౌన్: ప్రకృతిని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆలయ కమిటీ చైర్మన్ రేగుల సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో ఆదివారం గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న తరాలకు మంచి వాతవరణం అందించాలంటే ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు దొండి రమణ, పింజా అభినవ్, జంగిడి బోజన్న, నూతన నారాయణరెడ్డి, చిక్కాల నవీన్, భగత్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

నిజామాబాద్‌అర్బన్ : పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం దారుణం అన్నారు. స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీం సంబంధించిన బకాయిలను కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలలో ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్, దీపిక, దినేష్, ఆజాద్, గోవింద్, వీణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం



కోతకు గురవుతున్న రోడ్డు అంచు

బోధన్: పట్టణ శివారులోని అంబేడ్కర్‌కాలనీ సమీపంలో బోధన్ –నిజామాబాద్ వైపు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన భారీ గుంత, రోడ్డుఅంచున వేసిన మొరం వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి.ఈ రోడ్డు గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతాయి. అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. – ఎల్ వెంకటేశ్, అంబేడ్కర్ కాలనీ, బోధన్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



జాన్కంపేట్‌లో చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



దొన్కల్‌లో..



హసాకొత్తూరులో ..

వేల్పూర్/మోర్తాడ్/ కమ్మర్‌పల్లి : వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో బొమ్మకంటి మహిపాల్‌గౌడ్ అనే బాధితుడికి మంజూరైన రూ. 60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం అందజేశారు. మోర్తాడ్ మండలం దొన్కల్‌లో ముగ్గురి బాధితులకు కలిపి మంజూరైన రూ.66,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డం అనిల్ తెలిపారు. కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం హసాకొత్తూర్ గ్రామానికి చెందిన ఆరుగురు బాధితులకు మంజూరైన రూ. 1,69,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్, రేవతి గంగాధర్, గోపిడి లింగారెడ్డి, కుందేటి శ్రీను, మోహన్ నాయక్, జి.జి, జేమ్స్ గంగారెడ్డి, సొడ శ్రీనివాస్, సొడ జయరాజ్, రంగు కిషోర్‌గౌడ్, శెట్టి వినోద్, సోమ ప్రభాకర్, గాదెపల్లి నర్సారెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బంజారాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



భీమ్ నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఆల్ ఇండియా బంజార సేవా సంఘం డొంకేశ్వర్ మండల అధ్యక్షుడిగా నికాల్‌పూర్ గ్రామానికి చెందిన భీమ్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో ఈ ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా దత్తాపూర్‌కు చెందిన జగదీష్, అలాగే కోశాధికారిగా మూడ్ రాము, ఉపాధ్యాక్షులుగా గణేష్, సంయుక్త కార్యదర్శిగా చిరంజీవి ఎన్నికయ్యారు.

వీరిని జిల్లా ప్రధాన కార్యదర్శి పీర్‌సింగ్ నాయక్, ఇతర సంఘ పెద్దలు ఘనంగా సన్మానించి అభినందించారు. బంజారాల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భీమ్ నాయక్ అన్నారు.

సల్లంగా సూడు తల్లి

- ఆషాఢ మాసం సందర్భంగా గ్రామదేవతాలకు బోనాల సమర్పణ
- మొక్కులు తీర్చుకున్న భక్తులు



మెండోరాలో బోనాలను ఊరేగిస్తున్న భక్తులు



సాలూరలో పోతరాజుల విన్యాసాలు



నల్లపోచమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకునేందుకు బారులు తీరిన భక్తులు



పోలీస్ బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్



ఆర్మూర్‌లో నల్లపోచమ్మ ఆలయంలోని గ్రామదేతలు

ఆర్మూర్‌టౌన్/బోధన్/మోర్తాడ్/నవీపేట/రుద్రూర్ : సల్లంగా సూడు తల్లి అంటూ మహిళలు పలు చోట్ల గ్రామదేవతలకు బోనాలు తీశారు. ఈసందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆర్మూర్‌లో నల్ల పోచమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ, పెద్దమ్మ ఆలయాల్లో, సాలూరలో మహాలక్ష్మి, పోచమ్మ మందిరాలకు, రుద్రూర్ మండలంలోని అంబం (ఆర్), చిక్కడపల్లి గ్రామాల్లో బోధన్ పట్టణం ఆచన్‌పల్లిలో గ్రామదేవతలకు, నవీపేటలో గొడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ ఆలయంలో బోనాలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మేకలు, కోళ్లను నైవేద్యంగా సమర్పించారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.



బోధన్‌లోని ఆచన్‌పల్లిలో..



సాలూర మండల కేంద్రంలో బోనమెత్తిన మహిళలు



చిక్కడపల్లి గ్రామంలో..



కుటుంబ సభ్యులతో వన భోజనాలకు వచ్చిన ప్రజలు



అంబం (ఆర్) గ్రామంలో..

నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలి



సీపీ సాయి చైతన్య

ఖలీల్‌వాడి: ప్రజలకు న్యాయం అందించడంలో కోర్టు డ్యూటీలో ఉండే పోలీసు సిబ్బంది పాత్ర కీలకమని సీపీ సాయి చైతన్య అన్నారు. కోర్టు సమయానికి హాజరై, సాక్షులను సురక్షితంగా హాజరుపర్చి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని సూచించారు. నగరంలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లతో ఆదివారం సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకాన్ని పెంచేలా విధులు నిర్వర్తించాలన్నారు. సిబ్బంది పనితీరు, ప్రవర్తన, సమయపాలన , నైతిక విలువలు పోలీసుల క్రమశిక్షణను ప్రతిబింబిస్తాయన్నారు. నిజాయితీ, నిబద్ధతతో సేవలు అందించాలన్నారు. పోలీసు శాఖ గౌరవాన్ని మరింత పెంచేలా ముందుకు సాగాలని, భవిష్యత్తులో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరిత గతిన డిస్పోజల్ చేయాలని, ప్రధాన కేసులలో సంబంధిత ఎస్సైలు, సీఐ, ఏసీపీలతో బ్రీఫింగ్ చేయించాలని చెప్పారు. సమన్లు, వారెంట్స్ ఎప్పటికప్పుడు ఇవ్వాలని, కోర్టులో చార్జ్‌షీట్ వేసే ముందు అన్ని పత్రాలు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వా రెడ్డి, కోర్ట్ లైజన్ ఆఫీసర్ శ్యామ్ కుమార్, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేట్‌కు దీటుగా మాక్లూర్ పీహెచ్‌సీ



- రక్తపరీక్షలు చేయడంలో ముందంజ
- రోగులకు మెరుగైన వైద్య సేవలు



ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చిన రోగులు

మాక్లూర్: ప్రయివేట్‌కు దీటుగా మాక్లూర్ పీహెచ్‌సీ వైద్యసేవలు అందిస్తోంది. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు గడిచిన 6 నెలల కాలంలో సుమారు 12 వందల మందికి ఆయా రకాల వ్యాధులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈపరీక్షల నిర్వహణలో పీహెచ్‌సీ జిల్లాలో ముందంజలో ఉందని వైద్యుడు రవిశంకర్ వెల్లడించారు. ప్రతి గురువారం గర్భిణులకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నారు. ఆధునాతనమైన ల్యాబ్ సౌకర్యంతో కొలెస్ట్రాల్, లిఫిడ్ ప్రొఫైల్, గర్భిణులకు థైరాయిడ్, వృద్ధులకు కాల్షియం యూరిక్ యాసిడ్, ఫాస్టింగ్ లంచ్ షుగర్, కిడ్నీ సంబంధిత పరీక్షలు మొత్తం 19 రకాల రక్తపరీక్షలు చేస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో ఉన్నారు. దీంతో పీహెచ్‌సీకి వచ్చే రోగుల సంఖ్య కూడా పెరిగింది. రోజుకు 10 నుంచి 20 మందికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు.

వైద్యం అందించడంలో నిర్లక్ష్యం ఉండదు



పీహెచ్‌సీలో వైద్యం అందించడంలో నిర్లక్ష్యం ఉండదు. రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని వైద్యం అందిస్తున్నా. సంబంధిత జబ్బుకు రక్త పరీక్ష చేయిస్తాం. ఆస్పత్రికి వచ్చే రోగులు వైద్యం పొంది సంతృప్తిగా వెళ్తున్నారు.

– రవిశంకర్, వైద్యుడు, మాక్లూర్ పీహెచ్‌సీ

వైద్యసేవలు బాగున్నాయి

ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు బాగున్నాయి. వివిధ రకాల జబ్బులతో బాధపడుతూ వచ్చిన రోగులకు ముందుగా రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. తర్వాతనే తగిన మందులు ఇస్తున్నారు. – గంగాధర్, స్థానికుడు, మాక్లూర్